# పారిజాతం

## వీడిగుంట రామచంద్రమూర్తి

ఆఫీసులో అగుపెట్టేసరికి పదిన్నర అయింది....

అప్పటికి ఇంకా పక్కసీటు ఖాళీగా వుండటం కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించింది....

అసలు రామ్మూర్తి ఆఫీసుకి ఆలస్యంగా రావటం నేనెప్పుడూ గమనించలేదు....అలా అని శలవలు పెట్టటంకూడా చాలా తక్కువే !.... ఏడాదికి పన్నెండు 'కేజువల్ లీవు' లుంటే — కనీసం అయిదారుకూడా అతనెప్పుడూ వాడుకోడు....

రామ్మూర్తింటికీ - ఆఫీసుకీ చాలా దూరంవుంది - వాళ్ళింటిదగ్గర సరిగ్గా పొద్దున్న తొమ్మింటికి సిటీబస్సుంది- అదెక్కితే తొమ్మిదిన్నర అయ్యేసరికి ఆఫీసుకి చేరుకుంటాడు....మళ్ళీ సాయంత్రం, ఆఫీసునుంచి అయిదున్నరకో, ఆరింటికో బయల్దేరుతాడు.... బస్సు ఖాళీగా వుంటేనే ఎక్కుతాడు.... లేకపోతే లెఫ్ట్ రైటే!

నేను ఆఫీసులోచేరిన రెండేళ్ళలోనూ, నాకు బాగా సన్నిహితమైంది రామ్మూర్తి ఒక్కడే....!

దానికి కారణం లేకపోలేదు....

రామ్మూర్తి భార్య పారిజాతం మంచి రచయిత్రి....కేవలం రెండేళ్ళ వ్యవధి లోనే పాఠకులనుంచి విశేషమైన ఆదరాభిమానాలు పొందగలిగింది .... ఇవాళ, ఆవిడ రచన లేని వారపత్రిక కానీ మాసపత్రిక కానీ వుండదనటం అతిశయోక్తి కాదు....

అలా ఎందుకంటున్నానంటే—

ఏదైనా పత్రికలో వరసగా నాలుగయిదు వారాలపాటు, పారిజాతం రాసిన కథ ఏదీ రాకపోతే- 'పారిజాతంగారి కథ లేకపోవటంవల్ల మీ పత్రిక వుప్పు లేని పప్పులా నిస్సారంగా వుందనీ'- 'చందమామ లేని ఆకాశంలా వెలవెల బోతోంద'నీ ఆ పత్రికా సంపాదకునికి పాఠకులు వుత్తరాలు రాయటం నాకు తెలుసు....

పారిజాతం కథలంటే నా మటుకు నాకు చాలా ఇష్టం!....ఆవిడ రాసిన కథ ఏ పత్రికలో వచ్చినా, వెంటనే చదివి, దాన్ని గురించి నా అభిప్రాయాన్ని రామ్మూర్తికి చెప్పేవాణ్ణి.

బహుశా అలా పారిజాతం పై ఏర్పరచుకున్న అభిమానమే కావచ్చు- లేదా ఆవిడ రచనలమీదవున్న ఆసక్తే కావచ్చు-నన్ను రామ్మూర్తికి సన్నిహితుణ్ని చేసేయి....

ఆఫీసులో నా పక్క సీటే రామ్మూర్తిది....!

"ఇవాళ రామ్మూర్తి రాలేదేమిటో?"- సీటులో కూర్చున్నతరువాత, ఎదురుగా వున్న రామస్వామి నడిగేను....

"మీకు తెలీదా?....పాపం...వాళ్లావిడ పోయిందట!"—

త్రుళ్ళిపడ్డాను....

"పారిజాతంగారు పోయారా?...."

నమ్మలేని నిజం ఏదో విన్నట్టుంది....

"అవునండీ! రాత్రి వాంతులయ్యాయట !.... ఊరిచివర వున్నారేమో - డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళే అవకాశం కూడా లేకపోయిందట...."

"అయ్యో! రామ్మూర్తి ఎంతటి దురదృష్టవంతుడు?"—

"నిజమేసార్! పెళ్ళయి మూడేళ్ళు కాలేదు....!"-నిట్టూర్చేడు రామస్వామి.

"గుడ్డిలో మెల్ల! ...ఓ విధంగా దేవుడు మేలేచేసేడులెండి!"-రామస్వామి పక్కనున్న కామేశం కామెంట్ చేసేడు....

"ఏమిటీ?"-అడిగేను కామేశాన్ని.

"అదే !.... రామ్మూర్తికి పిల్లలు లేరు గదండీ .... వయసుకూడా అట్టే లేదాయిరి .... అందులోనూ వెయ్యి రూపాయల జీతం తెచ్చుకుంటున్నాడా?.. అతగాడికి మళ్ళీ తమ పిల్లనిచ్చి చెయ్యటానికి ఎవరు బాధపడతారు చెప్పండి?"- తన కామెంట్ ను వ్యాఖ్యానించేడు కామేశం.

హుం!....ఎంత నీచమైన ఆలోచన.?

ఏదైనా మొట్టమొదటిసారి జీవితంలో కలిగే అనుభూతే అందమైనదీ-అనిర్వచనీయమైనదీ!

పెళ్ళి విషయంలోనూ అంతే... !

అదో విచిత్రమైన బంధం .... పురుషుడు స్త్రీ మెడలో ఏక్షణాన మంగళ సూత్రం కడతాడో, అదేక్షణంనుంచీ వారిరువురి మధ్యా విడివడని బంధం ఏర్పడిపోతుంది - ఒకరికొకరూ, ఒకరి కోసం ఒకరూ అయిపోతారు....ఇద్దరి లోనూ ఒకేరకమైన మానసిక స్పందన కలుగుతుంది....

సూత్రధారణ అయింతర్వాత, సప్తపది చుట్టూ ఏడడుగులు నడుస్తూ- 'తనతో ఏడడుగులు నడచి, తనకు స్నేహితురాలవమని' భార్యనుద్దేశించి

చెప్తాడు భర్త.... 'తన స్నేహంనుంచి ఎప్పుడూ వియోగం పొందవద్దనీ, పరస్పరం ప్రేమతో, అనుకూల దాంపత్యంతో ప్రకాశిస్తూ - నిండు మనసుతో ఆహారాన్నీ బలాన్నీ కలసి పొందుతూ, కలసి జీవిద్దామనీ, కలసి ఆలోచించుకుందామనీ అలాగే అన్ని నియమాల్లోనూ బాహ్యేంద్రియాలుకూడా కలసి వుండేలా నడుచుకుందామనీ' ప్రతిజ్ఞ చేస్తాడు పురుషుడు....

అలాంటి పవిత్రబంధాన్ని ప్రసాదించేది పెళ్ళి....!

ఆ బంధం తెగిపోతే_మరోమనిషితో శారీరకంగా సుఖపడవచ్చునేమో_కానీ అంతకుముందు పొందిన రసానుభూతులు అంతర్వాహినులై అంతరాత్మను అంటిపెట్టుకొని వుండకమానవు!

పెళ్ళిచేసుకోవటం కర్తవ్యం ....! కానీ రెండో పెళ్ళి చేసుకోవటం మాత్రం లాలసత ....!

అలాంటి బలహీనత రామ్మూర్తికి వుందని నేననుకోను....

రామ్మూర్తికి పారిజాతమంటే ఎంత ప్రేమో నాకు తెలుసు ...అనేకసార్లు ఆమె ప్రస్తావన నాదగ్గర తీసుకొచ్చి, పరోక్షంగా ఆమె నెంతో మెచ్చుకునేవాడు....కథలు రాయమని, తాను ఎంతగా ఆమెను ప్రోత్సహించేదీ, ఆమె రాసిన కథల్ని తానెప్పుడు 'ఫెయిర్ కాపీ' చేసేదీ - అప్పుడప్పుడు నాతో చెప్పేవాడు....

ఓసారి నేనూ రామ్మూర్తీ వీరభద్రా టాకీసులో 'మల్లీశ్వరి' సినీమాకి వెళ్ళేం....వెళ్ళాలని ముందు అనుకోలేదు....ఆఫీసునుంచి బయటకొచ్చేక అనిపించింది....

అప్పటికే ఆ సినీమాని నేను అనేకసార్లు చూసేను....కానీ కృష్ణశాస్త్రిగారి పాటలకోసం - ఏడాదికొక్క మాటైనా ఆ సినీమా చూడకపోతే, అసలు జీవితమే వ్యర్థమనుకునే పిచ్చినమ్మకం నాది!....

ఆఫీసులోంచి బయటకువచ్చేక - ఎదురుగా_గోడమీద 'పోస్టర్' కనిపించేసరికి_పక్కనే వస్తున్న రామ్మూర్తిని అడిగేను_ 'పోదామా'_అని. 'ఓ.కే.' అన్నాడు రామ్మూర్తి


ఇద్దరం సినిమాహాలుకి చేరుకున్నాం. క్యూలో నిలబడ్డాం....ఇంకా బుకింగ్ తెరవలేదు....

అంతలో నా దృష్టి - గేటుదగ్గర రిక్షా దిగి - ఆడవాళ్ళ దగ్గరకు నడుస్తున్న ఓ వింతమనిషిమీద పడింది

ఆవిడ నడుస్తూంటే ఓ పిల్లపర్వతం కదలి వస్తున్నట్టనిపించింది....

"ఆవిడ చాలా విచిత్రంగా వుంది కదూ?"_ ఆవిడను, కళ్ళతో చే రామ్మూర్తికి చూపిస్తూ అన్నాను.

"అవున్నిజమే! చాలా పెక్యూలియర్ పర్సనాలిటీ!"_ రామ్మూర్తికూడా కొంచెం ఆశ్చర్యపోతూ అన్నాడు.



ఆవిడను నేను చూడటం అదే మొదటిసారి కాదు....

ఇదివరకు నాలుగయిదుసార్లు_ అప్పుడుకూడా ఇలాగే_సినీమా థియేటర్లలోనే చూసేను....

పెద్దగా వయస్సుండకపోవచ్చునేమోగానీ - మనిషిమాత్రం మహాలావుగా వుంది....బంగారురంగు శరీరచ్ఛాయ.... కట్టుకున్నచీర ఖరీదైనదిగానే వుంది! విపరీతంగా లావెక్కిపోయి వంపులు తిరిగిన అవయవాలు వికృతంగానూ విడ్డూరంగానూ కనిపిస్తున్నాయి. మెడలో మంగళసూత్రాలు మెరుస్తున్నాయి.

"ఆవిడకు పెళ్ళయింది!.... అదే వండర్!"_నెమ్మదిగా అన్నాను.

"గంతకు తగ్గ బొంత ఎక్కడో వుంటాడుగా!"_ నవ్వుతూ అన్నాడు రామ్మూర్తి.

"అంతటి మేరుపర్వతాన్ని కట్టుకునేందుకు ధైర్యంచేసిన వీరుడెవడో కానీ, మీటింగెట్టి, అతగానికి సన్మానం చెయ్యచ్చు .... బహుశా ఆవిడగారు తెచ్చిన కట్నానికి ఆశపడైనా వుండాలి. లేదా ఆయనగారుకూడా మరో మేరు పర్వతం అయ్యుండాలి!"—

మేమిద్దరం ఆమెవైపు చూడటం గమనించింది ఆవిడ... ఏదో తప్పుచేసినట్టు తలవంచుకుంది.

"పాపం .... తన పరిస్థితికి ఎంతగా సిగ్గుపడుతోందో, ఆవిడ!"- అన్నాను.

"సహజమే మరి! అందరూ తనవైపు వింతగాచూస్తే సిగ్గేకదా!!"—

"అలాంటి కేరక్టర్‌ను తీసుకుని మీ ఆవిడచేత కథ ఒకటి రాయించకూడదూ!"- అడిగేను.

"మంచి అయిడియా!....రాత్రి ఇంటికి వెళ్ళింతర్వాత చెప్తాను!"- అన్నాడు రామ్మూర్తి.

అంతలో బుకింగ్ తెరిచేరు .... టిక్కట్టు తీసుకుని హాల్లోకి వెళ్ళేం....

ఆవిడసంగతి అక్కడితో మరచిపోయేను.

రామ్మూర్తిమాత్రం మరచిపోలేదు పదిరోజులుకూడా తిరక్కుండా తన భార్యచేత కథ రాయించేడు.... ఆ కథని ఓ వారపత్రిక నిర్వహించిన కథల పోటీకి పంపినట్టు నాతో చెప్పేడు.

ఆ కథకి రెండో బహుమతీ వచ్చినప్పుడు, తన భార్య నాకు కృతజ్ఞతలు చెప్పమన్నదనీ, కాఫీకి రమ్మని ఆహ్వానించిందనీ కూడా చెప్పేడు రామ్మూర్తి. ఆఫీసులో ఇనస్పెక్షన్ జరుగుతుండటం వల్ల ఆ హడావిడిలో పడి, అప్పుడు నేను వాళ్ళింటికి వెళ్ళలేకపోయాను....

ఇప్పుడు....!?....

తప్పదు!!....

నేను అభిమానించే రచయిత్రే కాకుండా-నాకు దగ్గరైన స్నేహితుని భార్య!....అతన్ని ఓదార్చటం నా విధి.

ఆ ఆలోచన రాగానే-గబగబా లేచి-ఆ పూటకు శలవు రాసిచ్చి - ఆటోలో వాళ్ళింటికి చేరుకున్నాను.

ఇంటిముందు ఎవరెవరో వున్నారు.

వాళ్ళకు దూరంగా - అరుగుమీద- రామ్మూర్తి ఒక్కడూ కూర్చున్నాడు.... తలవంచుకుని, పైమీది తుండుగుడ్డతో ముఖం కప్పుకున్నాడు.

ఏడుస్తున్నాడేమో మరి!

అతని పరిస్థితిని చూడగానే - అప్రయత్నంగా నాకళ్ళు చెమ్మగిల్లాయి. కొంచెం ముందుకు నడిచేను....

కొంతమంది ముత్తయిదువులు - శవానికి బిందెలతో నీళ్ళుపోసి-పసుపు కుంకుమల్ని అద్దుతున్నారు....

మరికొంచెం ముందుకెళ్ళి-శవాన్ని చూసి-ఉలిక్కిపడ్డాను....

వీపుమీద నన్నెవరో - కమ్చీతో ఛెళ్ళున కొట్టినట్టయింది....

ఆ రోజు సినీమా హాల్లో నేను చూసిన....లావుపాటి....వింతమనిషి!!

అంటే....??!!

ఆవిడే పారిజాతమా??....

అదే!....పారిజాతమే ఆవిడా?....

రామ్మూర్తి భార్య ఆవిడ!!

అవును!- ఆవిడా... పారిజాతం.... రామ్మూర్తి భార్యా....అందరూ ఒక్కరే!

మరి....ఆ రోజున ఆమెను విమర్శిస్తుంటే రామ్మూర్తి నిజంచెప్పలేదు ఎందుకూ?"

అసలు ముందుగా ఆమెగురించి నేను చులకనగా మాట్లాడి వుండకపోతే రామ్మూర్తి చెప్పేవాడేమో?....

ఆ రోజు నేను చాలా తొందరపడ్డాను....

రామ్మూర్తి ఏమనుకున్నాడో?

ఆ ఆలోచన రాగానే నా శరీరమంతా చెమటతో తడిసిపోయింది.

నెమ్మదిగా రామ్మూర్తి దగ్గరకు నడిచేను....పలకరించే ధైర్యం నాకు లేకపోయింది.

అతని భుజంపై చేయివేసేను.

రామ్మూర్తి తలెత్తి-కళ్ళు తెరచి నావైపు చూసేడు.

అరక్షణంపాటు మేమిద్దరం - అలా ఒకరినొకరు చూసుకున్నాం.

ఆ చూపుల్లో ఎన్నో ప్రశ్నలు.... ఎన్నో ఆలోచనలు....మరెన్నో పశ్చాత్తాపాలు....ఎన్నెన్నో ఊరడింపులు!...

అంతే!....

ఆ అరక్షణం తర్వాత-తనకళ్ళల్లో కట్టలు త్రెంచుకుంటున్న కన్నీటిని దాచుకునే ప్రయత్నంలో-ముఖాన్ని మోకాళ్ళ మధ్య దాచేసుకున్నాడు రామూర్తి....

ఆ వాతావరణంలో మరి వుండలేక వచ్చేసేను....

* * *

ఇరవై రోజుల తర్వాత ఆఫీసులో జాయినయ్యేడు రామూర్తి.

జాయినయిన అయిదారురోజులు మేమిద్దరం - ఎవరికి వాళ్ళమే - ఏదో తప్పుచేసినట్టుగా-తప్పించుకు తిరిగేం....

ఆ తర్వాత ఒకనాడు నేను ఆగలేక రామ్మూర్తితో అన్నాను—

"సారీ రామ్మూర్తీ!.... ఆనాడు సినిమాహాలు దగ్గర ఆవిడను అలా చులకనగా మాట్లాడినప్పుడే నువ్ చెప్పివుండాల్సింది!....ఆవిడే నీ 'మిసెస్' అని తెలిసుంటే నేను నోరు జారేవాణ్ణి కాదు.... అయామ్ వెరీ సారీ!"—

రామ్మూర్తి బాధగా నవ్వి -

"ఫరవాలేదోయ్!....నువ్వేమీ లేవిమాటన్లేదు....వున్న విషయం ఏదో నేనే దాచేను....నువ్ కాకపోతే మరొకరు.... ఇంకొకరు....!" ఎంతోమంది తనను చూసి రకరకాలుగా కామెంటరీ చేయటం నాకు తెలుసు!"....అన్నాడు.

నేనేం మాట్లాడలేదు....క్షణం తర్వాత మళ్ళీ రామ్మూర్తే అన్నాడు చాలా నెమ్మదిగా—

"పారిజాతం చచ్చిపోలేదోయ్ ..నేనే చంపేసేను!"—

అయోమయంగాఅతనివైపుచూసేను.



"కానోయ్! నా ప్రవర్తనే పారిజాతాన్ని మానసికంగా కృంగదీసింది. జీవితంమీద విరక్తితో నిద్రమాత్రలు మింగి చేతులారా ప్రాణాలు తీసుకుంది" —చూపుడు వేలితో కన్నీటిని తుడుచుకుంటూ అన్నాడు రామ్మూర్తి.

"ఆత్మహత్యా," ఆశ్చర్యపోయాను.

"అసలు నీకు తెలీదేమో-మా పెళ్ళికి తనెంతో అందంగా వుండేది..నా కంటే సన్నగా వుండేది. కానీ రానురాను విపరీతంగా ఒళ్ళు వచ్చేసింది. చాలామంది డాక్టర్లకు చూపించేను. ఏవో గ్రంధుల లోపంవల్ల అలా లావెక్కిపోతారని, రకరకాల వైద్యాలు చేసేరు డాక్టర్లు .... ఫలితం కనిపించలేదు....దానికి సాయం మాకు పిల్లలు కూడా కలక్కపోవటంతో పారిజాతం మానసికంగా కృంగిపోయింది. జీవితంమీద మమకారాన్ని చంపుకుంది.

"....నేను తననెంతో ఊరడించేవాణ్ణి....తన బాధ మరచిపోవటానికి ఎన్నో పుస్తకాలు తెచ్చి చదవమనేవాణ్ణి ....కథలు రాయమని కూడా ఎంతో ప్రోత్సహించేను....ఓసారి, నా బలవంతంమీద. ఓ కథరాసి పత్రిక్కి పంపించింది- అది అచ్చులో రాగానే పారిజాతం ఎంత సంబరపడిందో నేనెప్పటికీ మరచిపోలేను....

"....అలా కథలు రాస్తూంటే - తన మనోవ్యాధి పూర్తిగా మరచిపోగలుగుతుందనే ఆశతో - ఆమెను మరింతగా ప్రోత్సహించేను.... కథలు.... నవలలు ఎన్నో రాసింది....పేరూ డబ్బూ సంపాదించుకుంది.

"....కానీ కథలు రాయాలంటే నలుగురి మధ్యకూ వెళ్ళాలి....నాలుగూ చూడాలి.... పరిశీలించాలి.... ఆ మాటే నేను పదేపదే చెప్పేవాణ్ణి-కానీ, నన్నూ తనతో రమ్మనికోరేది పారిజాతం....ఏదో సాకు చెప్పి నేను తప్పించుకునేవాణ్ణి"-

చెప్పటం ఆపి - నా వైపుచూసి - "ఎందుకో తెలుసా?"- అని అడిగేడు రామ్మూర్తి హఠాత్తుగా.

"ఎందుకూ! నీకూ చిన్నతనంగా తోచిందా?"- అడిగేను.

నవ్వేడు రామూర్తి....

ఆ నవ్వులో ఎన్నో అర్థాలు.... ఎన్నెన్నో నిట్టూర్పులు .... ఎంతో వేదాంతం!....

గాఢంగా నిట్టూర్చి మళ్ళీ చెప్పాడు.

"నిజమే! ఆనాడు సినిమాహాలు దగ్గర మీరే అన్నారు, గుర్తుందా?.... 'అలాంటి మేరు పర్వతాన్ని కట్టుకునేందుకు ధైర్యంచేసిన వీరుడెవరో'- అని! అందుకే ఆమె వెంట వెడితే,నన్నుచూసి నలుగురూ నవ్వుతారనీ, కించపరుస్తారనీ ఫీలయ్యేవాణ్ని! ఎన్నోసార్లు సినిమాకైనా తనతోరమ్మని ప్రార్థించింది పారిజాతం .... కానీ నేను మనిషిని కానోయ్ ..నాలో మానవత్వం లేదు.... నేను రాక్షసుడ్ని!....అందుకే పారిజాతం ఆత్మహత్య చేసుకుంది .... చచ్చిపోయే ముందు ఏమందోతెలుసా?"—అడిగేడు.

ఆసక్తిగా అతని కళ్ళల్లోకి చూసేను.

"ప్రపంచమంతా తనను చూసి నవ్వినా బాధపడనంది. కానీ నేను కూడా ప్రపంచంలోని ఆ మనుషులతోబాటు తననుచూసి నవ్వుతున్నానట.... పెదవుల మీద ఆదరణ రంగు పూసుకుని-మనసుతోనే అపహాస్యం చేస్తున్నానట!- ఎంత కరెక్టుగా ఊహించిందో చూసేవా? నిజమే మరి!....తాను రచయిత్రి! రచయిత్రిగా తనకు పేరు ప్రఖ్యాతలు రాకపోయినా, డబ్బు లేకపోయినా, నా ఓదార్పు, ఆదరణా వుండివుంటే తాను ఈ నిర్ణయం తీసుకునేది కాదట!"—

రామ్మూర్తి గొంతులోని విషాదం అతని మాటల్లో వ్యక్తమైంది.. అతని నరాల్లో ప్రవహించే రక్తం కళ్ళల్లో కనిపించింది.

"నేను చాలా పొరపాటే చేశాను.... నా బలహీనతే పారిజాతాన్ని బలి తీసుకుంది...." —

రెండు చేతులూ తలలోకి దూర్చి-జుట్టు పీక్కుంటూ తనలో తానే గొణుక్కున్నాడు రామ్మూర్తి!!

———